నిషేధమా.. నీవెక్కడ?



ప్లాస్టిక్ కవర్లలో పూల అమ్మకాలు



అరటిపళ్ల సందులోని ఫ్రూట్ దుకాణంలో అధిక మైక్రాన్లున్న కవర్లలో పళ్ల విక్రయం



టౌన్ కొత్తరోడ్డు వద్ద కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

యథేచ్ఛగా ప్లాస్టిక్ వినియోగం

ఆగని ప్లాస్టిక్ వినియోగం

అధికారుల చర్యలు నిష్ఫలం



జ్యూట్, గుడ్డ సంచుల వైపు మళ్లని జనం

పూర్ణామార్కెట్ వద్ద నిరుపయోగంగా మిగిలిన ప్లాస్టిక్‌తర వస్తువుల విక్రయ స్టాల్

జగదాంబ: నిషేధిత ప్లాస్టిక్ వినియోగం ఎన్ని చర్యలు తీసుకున్నా ఆగటం లేదు. గత ఏడాది డిసెంబర్, ఈ ఏడాది జనవరిలో ప్లాస్టిక్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఫిబ్రవరిలో దాడులు నిర్వహించి అపరాధ రుసుము వసూలు చేశారు. ట్రేడ్ లైసెన్సులు రద్దు అని జీవీఎంసీ అధికారులు హెచ్చరించారు. అలా మార్చి వెళ్లిపోయి ఏప్రిల్ వచ్చేసింది. అయినప్పటికీ ఎక్కడా ప్లాస్టిక్ వినియోగం మాత్రం తగ్గలేదు.

పూర్ణామార్కెట్ కేంద్రంగా..

పూర్ణామార్కెట్‌లో చిన్న దుకాణాలు కాకుండా 33 హోల్‌సేల్ ప్లాస్టిక్ దుకాణాలు ఉన్నాయి. వీరందరూ అనకాపల్లి, గాజువాక, తగరపువలస తదితర ప్రాంతాల నుండి ప్లాస్టిక్ సామగ్రి టోకున కొనుగోలు చేసి చిల్లర వర్తకం సాగిస్తుంటారు. టౌన్ కొత్తరోడ్డు జీవీఎంసీ డంపింగ్ యార్డుకు ఒక్క రోజులోనే టన్నుల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు వస్తున్నాయంటే ప్లాస్టిక్ వినియోగం ఏ మేరకు ఉందో అర్థం చేసుకోవచ్చు. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనాలు, పండ్లు, మటన్, చికెన్, బేకరీ వస్తువులు, కూరగాయలు అన్నింటికీ ప్లాస్టిక్‌నే వినియోగిస్తున్నారు.

ఉపయోగపడని జీవీఎంసీ ప్లాస్టిక్‌తర వస్తువుల స్టాల్..

ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా జీవీఎంసీ ప్లాస్టిక్‌తర వస్తువుల స్టాళ్లను నగరంలో పలు చోట్ల ప్రారంభించింది. అదే విధంగా సర్దార్ వల్లబాయి పటేల్ పూర్ణా మార్కెట్ ప్రధాన గేటు వద్ద కూడా ఈ కేంద్రాన్ని ప్రారంభించారు. ఇందులో జ్యూట్ బ్యాగ్‌లు, అరటి ఆకులు, చెరకు పిప్పితో తయారు చేసిన ప్లేట్లు, గ్లాసులు, పేపర్ గ్లాసులు, గుడ్డ సంచుల అమ్మకాలు మొదలు పెట్టారు. అయితే తర్వాతి కాలంలో ఆ స్టాల్ కాస్త మూత పడింది.

ప్లాస్టిక్ వినియోగం అలాగే ఉంది

నిషేధాన్ని అధికారులే పట్టించుకోవడంలేదు. అందుకే వ్యాపారులు నచ్చినట్లు వ్యాపారాలు చేసుకుంటున్నారు. ఇప్పటికీ ప్లాస్టిక్ వినియోగం అలాగే కొనసాగుతోంది. చిన్నచిన్న దుకాణాల నుండి పెద్ద షాపుల వరకు అన్ని చోట్లా ప్లాస్టిక్ వాడకం జరుగుతోంది. దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలి. – సతీష్‌వర్మ, వినియోగదారుడు

శాశ్వత చర్యలతోనే అడ్డుకట్ట..

అధికారులు శాశ్వత చర్యలు తీసుకోవాలి. అప్పుడే ప్లాస్టిక్ నిషేధం విజయవంతం అవుతుంది. మానవులతో పాటు పర్యావరణం బాగుంటుంది. జీవీఎంసీ పెట్టిన ప్లాస్టిక్‌తర వస్తువుల దుకాణాలను కొనసాగిస్తే వినియోగదారుల్లో మార్పు వస్తుంది. – శ్రీరామమూర్తి, వినియోగదారుడు

దాడులు కొనసాగిస్తున్నాం..



సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ వినియోగంపై దాడులు కొనసాగిస్తున్నాం. ఎక్కడ దొరికినా అపరాధ రుసుము విధిస్తున్నాం. ఇప్పటికే హోల్‌సేల్ దుకాణాల వద్ద అమ్మకాలు బాగా తగ్గిపోయాయి. అయినప్పటికీ ఎక్కడైనా అమ్మకాలు జరిపితే జీవీఎంసీకి తెలియపరచాలి. – ఎం. మల్లయ్యనాయుడు, జెడ్సీ, జోన్–4.

క్లుప్తంగా

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేకం



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు అమ్మవారికి తులసీదళార్చన..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 20 వినతులు

దాబాగార్డెన్స్: జీవీఎంసీలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్‌ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 20 వినతులు వచ్చాయని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్ ఎన్. ప్రభాకరరావు తెలిపారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీలు, డీసీపీలు, ఏసీపీలతో కలిసి ఫిర్యాదులు స్వీకరించారు. అందిన వినతుల్లో జోన్–2 నుంచి నాలుగు, జోన్–3 నుంచి రెండు, జోన్–5 నుంచి పదకొండు, జోన్–6, జోన్–7, జోన్–8 నుంచి ఒక్కో వినతి వచ్చిందన్నారు. అందిన వినతులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు.

కుటుంబం చెంతకు బీహార్‌వాసి



కుటుంబ సభ్యులతో దశరథ్

సీతమ్మధార: నలుగురు అన్నదమ్ముల్లో పెద్దవాడైన బీహార్ వాసి దశరథ్ (70) చెప్పుల దుకాణం నడుపుకుంటూ బతికేవాడు. అతను వ్యాధికి గురై రాంచీ ఆస్పత్రిలో చికిత్స పొందినా ప్రయోజనం లేకపోయింది. పిల్లలు చిన్నతనంలో ఉన్నప్పుడే వారిని వదిలిపెట్టి వెళ్లిపోయాడు. అతన్ని ఏయూటీడీ సిబ్బంది 2019 సెప్టెంబర్‌లో గుర్తించి ఐదేళ్ల పాటు ఆశ్రయం కల్పించారు. పలుమార్లు ప్రభుత్వ మానసిక వైద్యశాలలో చేర్పించి చికిత్స అందించడంతో కోలుకున్నాడు. శ్రద్ధా సహకారంతో అతన్ని బీహార్‌లోని రోహితాస్ జిల్లాలో గల దరిహత్ గ్రామంలో ఉంటున్న కొడుకు సంజయ్ కుమార్, కోడలు పూజితదేవిలకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

కేజీహెచ్‌లో జనన ధ్రువీకరణ కేంద్రం ప్రారంభం



జనన ధ్రువీకరణ కేంద్రంలో పత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

మహారాణిపేట: కేజీహెచ్ గైనకాలజీ విభాగంలో జనన ధ్రువీకరణ కేంద్రాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. పుట్టిన ప్రతి బిడ్డకు గుర్తింపు అనేది ఒక ప్రాథమిక హక్కు అన్నారు. ఇప్పటి వరకు జనన ధ్రువీకరణ పత్రం కోసం తల్లిదండ్రులు వేర్వేరు కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేదన్నారు. అటువంటి కేంద్రాన్ని కేజీహెచ్‌లోనే ప్రారంభించడం వల్ల కేవలం 24 గంటల్లోనే జనన ధ్రువీకరణ పత్రం అందజేయవచ్చన్నారు. తల్లులు తమ ఆధార్ కార్డుతో వచ్చిన వెంటనే ఈ ప్రక్రియ పూర్తి అవుతుందని సూపరింటెండెంట్ డాక్టర్ పి. శివానంద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్యాదేవి, ఆర్‌ఎంవో డాక్టర్ మెహర్‌కుమార్, పలువురు అధికారులు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

మే 4న మేడే సాంస్కృతికోత్సవాలు

దాబాగార్డెన్స్: మేడేను పురస్కరించుకుని మే 4న అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం వేదికగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కార్యక్రమ ఇన్‌చార్జి జీఏస్ రాజేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. సామాజిక న్యాయం, మహిళా సాధికారత, సమైక్యత, సమానత్వం, దేశభక్తి వంటి అభ్యుదయ భావాలు కలిగిన కళారూపాల ప్రదర్శన ఉంటుందన్నారు.

కలెక్టరేట్‌లో చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ పంపిణీ చేస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: వివిధ పనులపై కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజల సౌకర్యార్థం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం, ఉచిత మజ్జిగ కేంద్రాన్ని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ శుక్రవారం ఉదయం ప్రారంభించారు. దీంతో పాటు ఎండ వేడిమి నుంచి ఉపశమనం పొందేందుకు వీలుగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ కౌంటర్‌ను కూడా ప్రారంభించి సిబ్బందికి, ప్రజలకు మజ్జిగ అందజేశారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని యంత్రాంగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాల్లో చల్లని తాగు నీరు, ఉచిత మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంటాయని డీఆర్‌వో భవానీ శంకర్ తెలిపారు. ఉచిత మజ్జిగ పంపిణీని మల్లిడి ధర్మారెడ్డి జ్ఞాపకార్థం అతని భార్య సత్యవతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో ఈశ్వరరావు, ఆరోగ్య శాఖ సిబ్బంది, రెడ్ క్రాస్ కార్యదర్శి పి.రవికుమార్, పీఆర్‌వో ఎస్.కె.ఎల్. రావు, మెడికల్ ఆఫీసర్లు లక్ష్మి, బీవీవీ ప్రసాద్, జిల్లా కోఆర్డినేటర్ బి.సంతోష్, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

జ్యోతీరావు పూలేకు ఘన నివాళి



జ్యోతీరావుపూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాసుపల్లి గణేష్‌కుమార్ తదితరులు



పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వజ్జిపర్తి శ్రీనివాసరావు తదితరులు



ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతో కలిసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్



పూలే విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న సీపీఐ నేత నారాయణ తదితరులు

దాబాగార్డెన్స్: వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు జ్యోతీరావు పూలే అని కలెక్టర్, జీవీఎంసీ ఇన్‌చార్జ్ కమిషనర్ డాక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ పేర్కొన్నారు. నగరంలోని జడ్జి కోర్టు సమీపంలో ఉన్న జ్యోతీరావు పూలే విగ్రహం వద్ద శుక్రవారం ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావుతో కలిసి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికా విద్యకు జ్యోతీరావు పూలే ఎంతో ప్రాధాన్యత ఇచ్చారన్నారు.

పూలే ఆశయాలు శిరోధార్యం

జ్యోతీరావు పూలే ఆశయాలను అనుసరిస్తూ, పార్టీలకు అతీతంగా సంక్షేమాన్ని అందించిన ఘనత మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదే అని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పేర్కొన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం పూలే జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుపల్లి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు పూలే అన్నారు. కులమతాలు, పార్టీలను రెచ్చగొడుతూ కూటమి ప్రభుత్వం కక్ష పూరిత రాజకీయాలు చేస్తుందని మండిపడ్డారు. పార్టీ విశాఖ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్రభరత్, కో ఆప్షన్ సభ్యుడు షరీఫ్, పలు వార్డుల నాయకులు పీతల వాసు, బొండాడ వెంకట రమణ, కోట ఆనంద్ ప్రసాద్, చోడిపిల్లి శివ, వాసు తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్‌పార్క్ హోటల్ వద్ద..

మహాత్మా జ్యోతీరావు పూలే 198వ జయంతి గ్రీన్‌పార్క్ హోటల్ సమీపాన గల పూలే విగ్రహం వద్ద అన్ని వర్గాల వారు, బీసీ సంఘాల నాయకులు నిర్వహించి నివాళులర్పించారు. ప్రముఖ న్యాయవాది వజ్జిపర్తి శ్రీనివాసరావు, బమ్మిడి గంగాధర్, సోడదాసి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పూలేకు సీపీఐ ఘన నివాళి

మహాత్మా జ్యోతీరావు పూలే గొప్ప దేశభక్తుడని సీపీఐ జాతీయ కార్యదర్శి కె నారాయణ అన్నారు. గ్రీన్‌పార్క్ హోటల్ సమీపంలోని పూలే విగ్రహానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తితో కలిసి ఆయన పూల మాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ. విమల, సీఎస్ క్షేత్రపాల్, ఎస్.నాగభూషణం, బి.పుష్పలత, జి.కాసులరెడ్డి, యు.నాగరాజు, ఆదినారాయణ, రవి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వీడ్కోలు వేడుకలు



ప్రిన్సిపాల్‌కు జ్ఞాపిక అందజేస్తున్న విద్యార్థినులు



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల శుక్రవారం కళకళలాడింది. నిత్యం యూనిఫాంతో కనిపించే విద్యార్థినులు రంగు రంగుల వస్త్రధారణతో కనిపించారు. నృత్యాలు.. కేరింతలతో కళాశాల దద్దరిల్లింది. డిగ్రీ చివరి సంవత్సరం విద్యార్థినులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల మాట్లాడుతూ ఆనందం.. దు:ఖం కలగలిపిన సందర్భమిది అన్నారు. గొప్ప లక్ష్యాలు ఏర్పరచుకుని విజయం సాధించాలని అభిలషించారు. అనంతరం కళాశాల స్టూడెంట్ కన్వీనర్ డాక్టర్ ఆర్. కిరణ్మయి మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగి కళాశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేపట్టిన సాంస్కృతి కార్యక్రమాలు కనుల పండువగా సాగాయి. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ బి. సంతోషి అనూష, స్టూడెంట్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ కె. గీతాంజలి, బి. రాధమ్మ, ప్రెసిడెంట్ పి. సాయితరణి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

అభాగ్యులకు వసతి గృహంలో ఆశ్రయం



వసతిగృహంలో మెహతో



వసతి గృహంలో నాగేశ్వరరావు

సీతమ్మధార: ఒడిశాకు చెందిన సైమిత్ర మెహతో (35) మతిస్థిమితం లేని స్థితిలో విశాఖ రైల్వేస్టేషన్‌లో ఒంటరిగా తిరుగుతుండగా ఆర్‌పీఎఫ్ పోలీసులు గుర్తించారు. ఏయూటీడీ సిబ్బందికి సమాచారం అందించడంతో ఆమెను మహిళల వసతి గృహానికి తరలించారు. ఆమె ఏమీ మాట్లాడకుండా మౌనంగా ఉంటుంది. ప్రస్తుతానికి ఆమెను పరిశీలనలో ఉంచినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు.

షెల్టర్ హోంలో మాచర్ల వ్యక్తి..

సీతమ్మధార: మాచర్లకు చెందిన నాగేశ్వరరావు (45) లారీ క్లీనర్‌గా గతంలో పని చేసేవాడు. ఇతను అవివాహితుడు. ఒక ప్రమాదంలో కన్ను పోగొట్టుకున్నాడు. అప్పటి నుండి రోడ్ల మీద భిక్షాటన చేస్తూ తిరుగుతున్నాడు. జగదాంబ దగ్గర పోలీస్ కమీషనర్ శంఖబ్రత బాగ్చి అతన్ని చూసి మహారాణిపేట పోలీసులకు తెలియజేయడంతో పోలీసులు అతన్ని ఏయూటీడీ వసతి గృహానికి తరలించారు. ఈ రెస్క్యూలో ఎస్ఐ లక్ష్మి, కానిస్టేబుల్ రాంబాబు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌లో కార్మికుల తొలగింపులు ఆపాలి



మాట్లాడుతున్న నరసింగరావు

దాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో గత మూడు నెలల్లో 3 వేల మందికి పైగా కాంట్రాక్ట్ కార్మికులను స్టీల్ యాజమాన్యం అక్రమంగా తొలగించిందని, గత నెలలో 1213 మందిని వీఆర్ఎస్, పదవీ విరమణతో పర్మినెంట్ ఉద్యోగులు, అధికారులను బయటకు పంపారని, 4 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను గత ఏడాది అక్టోబర్ ఒకటిన ఒకే రోజు తొలగించేందుకు నిర్ణయించుకుని, శాంతి భద్రతల సమస్యలకు భయపడి వెనక్కు తగ్గారని సిటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు తెలిపారు. సిటు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో విశాఖ జిల్లా అధ్యక్షుడు కేఎం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్, ఎస్. జ్యోతీశ్వరరావుతో కలిసి మాట్లాడారు. ఈ తొలగింపుల వల్ల స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తికే తీవ్ర విఘాతం కలుగుతుందన్నారు. ఇది చట్ట వ్యతిరేకరమిన, ప్లాంట్‌లో ఉద్యోగులను తొలగిస్తే ఉత్పత్తి ఎలా పెంచుతారని ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్‌కు కట్టబెట్టే బాటలో కేంద్ర ప్రభుత్వం పయనిస్తోందని, ఓ వైపు నక్కపల్లిలో ఆర్సీలార్ మిట్టల్ నిర్మించే 7.3 మిలియన్ టన్నుల స్టీల్‌ప్లాంట్‌లో 20 వేల మందికి ఉద్యోగాలొస్తాయని ప్రభుత్వం అనుమతి ఇచ్చిందన్నారు. నిజాయితీగా స్టీల్‌ప్లాంట్ నడపాలంటే కార్మికుల తొలగింపు వెంటనే ఆపాలన్నారు. స్టీల్‌ప్లాంట్ విషయమై విశాఖ పార్లమెంట్ సభ్యుడితో పాటు గాజువాక ఎమ్మెల్యే ఎందుకు నోరు తెరవడం లేదని నరసింగరావు ప్రశ్నించారు. వారు జోక్యం చేసుకుని స్టీల్ మంత్రిత్వ శాఖతో మాట్లాడాలని, ఎన్నికల ముందు విశాఖ స్టీల్‌ను కాపాడుతామన్న మాటను నిలబెట్టుకోవాలని నరసింగరావు సూచించారు.

వేడుకగా కిడ్స్ కాన్వొకేషన్



ఉపాధ్యాయులతో విద్యార్థులు

జగదాంబ: దాబాగార్డెన్స్ రవీంద్రభారతి పాఠశాలలో కిడ్స్ కాన్వొకేషన్ వేడుకలు ఘనంగా జరిగాయి. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మృణాళిని మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్‌కు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ బ్యూలగ్రేస్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తదతరులు పాలొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన



యాప్ గురించి అవగాహన కల్పిస్తున్న వన్‌టౌన్ సీఐ జీడీ బాబు

మహారాణిపేట: మహిళలకు రక్షణ కల్పించే శక్తి యాప్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వన్‌టౌన్ పోలీసులు ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ జీడీ బాబు మాట్లాడుతూ ప్రతి మహిళ తన మొబైల్ ఫోన్‌లో శక్తియాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలన్నారు. అత్యవసర సమయంలో పోలీసుల సాయం పొందేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు. గూగుల్ ప్లే స్టోర్.. యాప్‌స్టోర్‌లో దీన్ని అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఒక్క క్లిక్‌తో సమీప పోలీస్ కంట్రోల్ రూమ్‌కి సమాచారం చేరి మహిళలకు రక్షణ లభిస్తుందన్నారు.


ధ్యాన సాధనతో సంపూర్ణ ఆరోగ్యం



చైతన్య రథయాత్రలో భక్తజనం

మహారాణిపేట: సహజ యోగ ద్వారా కుండలినీ జాగృతమై సంపూర్ణ ఆరోగ్యం పొందొచ్చని సహజ యోగ రాష్ట్ర కోఆర్డినేటర్ కల్లూరు రామకృష్ణ అన్నారు. శ్రీ మాతాజీ నిర్మలాదేవి సహజ యోగ ట్రస్ట్ ఆధ్వర్యంలో నేటి నుంచి 28వ తేదీ వరకూ ఉమ్మడి విశాఖ జిల్లాలో సహజ యోగ చైతన్య ప్రచార రథయాత్ర జరగనున్నది. ఈ రథం హైదరాబాద్ నుంచి జగ్గయ్యపేట వద్ద ఎన్టీఆర్ జిల్లా మీదుగా నేడు విశాఖలో ప్రవేశించింది. ఈ సందర్భంగా చైతన్య రథానికి సహజ యోగులు ఘన స్వాగతం పలికారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకూ ఆరు నెలల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఈ రథయాత్ర జరగనుంది. ఈ కార్యక్రమంలో సౌత్ రీజినల్ కోఆర్డినేటర్ సుభాషిణి, రాష్ట్ర కమిటీ మెంబర్లు స్వాతి ప్రియా, శ్రీనివాసరావు, జిల్లా కోఆర్డినేటర్ రమేష్, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే డ్రగ్స్ రవాణాకు చెక్



మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చి

విశాఖ సిటీ: పోలీస్, నార్కోటిక్ కంట్రోల్ బ్యూరోతో పాటు అన్ని సంబంధిత శాఖలు, ప్రైవేట్ ఏజెన్సీల సమన్వయంతోనే డ్రగ్స్ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయగలమని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి స్పష్టం చేశారు. శుక్రవారం పోలీస్ సమావేశ మందిరంలో పార్సిల్, కొరియర్, పలు రకాల ఈ–కామెర్స్ సంస్థల ప్రతినిధులతో ఎన్‌సీబీ అధికారులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగినా తన నంబర్ 7995095799కు సమాచారం ఇవ్వాలని సూచించారు. పార్సిల్స్, కొరియర్, ఈ–కామర్స్ ద్వారా నార్కోటిక్ డ్రగ్స్ రవాణా జరుగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో ఎన్‌సీబీ అధికారులు వివరించారు. రవాణా అవుతున్న పార్సిళ్లలో నార్కోటిక్ డ్రగ్స్ ఉంటే ఎలా గుర్తించాలి, ఎవరైనా డ్రగ్స్ రవాణా చేసేందుకు ప్రయత్నిస్తే సమాచారం పోలీసులకు ఎలా అందజేయాలి వంటి విషయాలపై అవగాహన కలిగించారు.

సరోగసీ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

మహారాణిపేట: సరోగసీ, ఏఆర్‌టీ (సహాయక పునరుత్పత్తి సాంకేతికత) కోసం చేసుకున్న దరఖాస్తులను తనిఖీ చేయడంతో పాటు అక్కడ మౌలిక సదుపాయాలను కూడా పరిశీలించాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఏఆర్‌టీ, సరోగసీ చట్టంపై జరిగిన సమావేశంలో కలెక్టర్ పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. పలు ఆస్పత్రులు సరోగసీ కోసం దరఖాస్తు చేసుకున్నాయని, వీటిని పరిశీలించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు కోరారు. కిమ్స్ ఐకాన్ ఆస్పత్రి ఏఆర్‌టీ లెవల్–1, నోవా ఐవీఎఫ్ కేంద్రం ఏఆర్‌టీ లెవల్–2, ఐశ్వర్య ఫెర్టిలిటీ కేంద్రం ఏఆర్‌టీ లెవల్–2 కోసం దరఖాస్తు చేసుకున్నాయని వివరించారు. కేజీహెచ్ గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ సంధ్యాదేవి, పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, పలు విభాగాల అధికారులు ఎల్.వి.రమణి, బి.నాగేశ్వరరావు, నారాయణరావు, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.